

ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ సస్పెన్షన్

గరుగుబిల్లి, ఫిబ్రవరి 22: మండలంలో ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.పద్మావతిని సస్పెండ్ చేస్తూ జిల్లా డ్వామా పీడీ కె.రామచంద్రరావు గురువారం ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఏపీవో ఎం.గౌరీనాథ్ మాట్లాడుతూ.. టెక్నికల్ అసిస్టెంట్ పద్మావతి మరుపెంట, కొంకడివరం, చినగుడబ, సంతోషపురం పంచాయతీల్లో విధులు సక్రమంగా నిర్వహించలేదన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లోపించాయని, వేతనదారులకు ముందస్తు కొలతలు అందించలేదని, మేట్ల ఎంపికలో జాప్యం చేశారని చెప్పారు. దీంతో ఆమెను సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

నాడూ నేడూ ఇంతే!

- జిల్లాలో నిలిచిన రెండో విడత పనులు
- పూర్తికాని అదనపు గదుల నిర్మాణం
- బిల్లుల చెల్లింపులో జాప్యం
- వరండాల్లోనే తరగతుల నిర్వహణ

జిల్లాలో నాడు-నేడు రెండో విడత పనులు నిలిచిపోయాయి. పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు చేపట్టిన ఈ పనులకు అతీగతీ లేదు. ఎప్పుడు పూర్తవుతాయో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. సిమెంట్ కొరత, బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం, నిధుల లేమి కారణంగా పనులు మందకొడిగా జరుగుతున్నాయి. సిమెంట్, విద్యుత్ పరికరాలు, టైల్స్ వంటివి సరఫరా చేయకపోవడంతో ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. అదనపు గదుల నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోవడంతో విద్యార్థులు ఇరుకు గదుల్లోనే చదువులు సాగించాల్సిన దుస్థితి నెలకొంది.

(పార్వతీపురం ఆంధ్రజ్యోతి)

జిల్లాలో నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా రెండో దశలో 521 పాఠశాలలు, 14 జూనియర్ కళాశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.141.51కోట్లు కేటాయిస్తూ గతంలో ఆదేశాలు జారీ చేసింది. అయితే నిర్మాణాల ప్రాప్తికి బిల్లులు మంజూరు కావడం లేదు. మరోవైపు కొన్నిచోట్ల సకాలంలో సిమెంట్, ఇసుక, ఇతర సామగ్రి సరఫరా కావడం లేదు. ప్రస్తుతం బడుల్లో అదనపు తరగతి గదుల నిర్మాణాలు తాత్కాలికంగా నిలిపివేశారు. నాడు-నేడు పనులకు సంబంధించి ఎలక్ట్రికల్, ఫ్లంబింగ్ మెటీరియల్స్‌ను ప్రభుత్వమే నేరుగా సరఫరా చేస్తుందని గతంలో చెప్పారు. ఆ తర్వాత స్థానికంగా కొనుగోలు చేసుకోవాలని సూచించారు. దీంతో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల కమిటీలు అప్పటికప్పుడు ఎలక్ట్రికల్ ఇతరత్రా మెటీరియల్స్‌తో కొనుగోలు చేసి పనులు పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు హెచ్ఎంలు, తల్లిదండ్రుల కమిటీల మధ్య అనేకచోట్ల సమన్వయ లోపం నెలకొంది. ఇప్పటి వరకు రూ.55.45 కోట్ల విలువైన పనులకు సంబంధించిన బిల్లులు మాత్రమే అప్‌లోడ్ చేశారు. ఇందులో రూ.48 కోట్లు మాత్రమే చెల్లింపులు జరిగాయి. మిగిలిన సొమ్ము కాంట్రాక్టర్లకు చెల్లించకపోవడంతో పనులు ఆపేశారు. అదనపు తరగతి గదుల నిర్మాణాలతో పాటు ఇతర అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. దీంతో పార్వతీపురం మండలంలోని నర్సిపురం, గరుగుబిల్లి మండలంలోని రావుపల్లి, తదితర పాఠశాలల్లో గదులు లేక వరండాల్లోనే విద్యార్థులకు పాఠాలు బోధించాల్సిన పరిస్థితి ఉపాధ్యాయులకు ఏర్పడింది. నాణ్యమైన విద్యను అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న వైసీపీ ప్రభుత్వం విద్యార్థులకు అవసర మైన తరగతి గదులను నిర్మించలేక పోతుందని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. నాడు-నేడు రెండో దశ అభివృద్ధి పనులకు నిధులు కేటాయింపు కాగితాలకే పరిమితం కావడంతో ఎప్పటికి పూర్తవుతాయన్న సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

బిల్లులు అందేనా?

మరో రెండు నెలల్లో రాష్ట్రంలో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఒకవేళ ప్రభుత్వం మారితే తమకు బిల్లులు అందుతాయో? లేదో? అని కాంట్రాక్టర్లు మదనపడుతున్నారు. ప్రస్తుతం నాడు-నేడు పనులు చేస్తున్న వారిలో అత్యధిక శాతం వైసీపీ మద్దతుదారులే ఉన్నారు. వీరంతా అప్పులు చేసి పనులు చేపట్టారు. అయితే, ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. దీంతో పనులు ఆపేశారు. ఎన్నికల లోపు పనులు ప్రాప్తికి బిల్లులు చేయించుకునేందుకు అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.



పార్వతీపురం మండలం నర్సిపురం పాఠశాలలో నిలిచిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణం



గరుగుబిల్లి మండలం రావుపల్లి పాఠశాలలో ఆగిన తరగతి గదుల నిర్మాణం

వరండాల్లో తరగతులు నిర్వహిస్తున్నాం

మా పాఠశాలకు సంబంధించి అదనపు గదుల నిర్మాణం జరుగుతుంది. పాఠశాలల్లో 12 సెక్షన్లు ఉన్నాయి. ఆరు గదులు ఉండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వరండాల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నాం.

-కె.వెంకటనాయుడు, హెచ్ఎం,
జిల్లా పరిషత్ పాఠశాల నర్సిపురం



నర్సిపురం జడ్పీ పాఠశాలలో వరండాలో తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

ఆధునికీకరణ లేనట్టే!

- ఎడమ ప్రధాన కాలువ నుంచి నీరు విడుదల
- ఖరీఫ్‌కు తప్పని ఇబ్బందులు
- నిధుల సమస్యతో చేతులెత్తేసిన అధికారులు

(గరుగుబిల్లి)

తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని పాత రెగ్యులేటర్‌కు చెందిన ఎడమ ప్రధాన కాలువ, కుడి కాలువ ఆధునికీకరణ పనులు దాదాపుగా చేయడం లేదన్న సంకేతాలు వెలువడ్డాయి. గత మూడు నెలలుగా పనులు చేస్తామని ఊరించిన అధికారులు నిధుల సమస్యతో చేతులెత్తేశారు. గతేడాది డిసెంబరు నుంచి పనులు చేస్తామని చెబుతూ వస్తున్న అధికారులు నిధులు మంజూరు కాకపోవడంతో నీరు విడుదలకు మొగ్గు చూపారు. గతంలో నిర్వహించిన ఆధునికీకరణ పనులకు సంబంధించి కాంట్రాక్టర్లకు సుమారు రూ.15 కోట్లకు పైగా బకాయిలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. ఈ బకాయిలు చెల్లించకపోవడంతో గత మూడున్నరేళ్లుగా ఆధునికీకరణపై దృష్టి సారించని పరిస్థితి ఏర్పడింది. పనుల నిర్వహణకు ప్రభుత్వం మూడు పర్యాయాలు గడువు పెంచినా నిధులు విడుదల చేయలేదు. ఈ ఏడాది మే నెలాఖరుకు పనులు పూర్తి చేయాలని ఉన్నతాధికారులు గడువు విధించారు. ఇప్పటి వరకు రెండు కాలువల పరిధిలో కేవలం 30 శాతం పనులే నిర్వహించారు. 70 శాతం పనులు చేయాల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై దృష్టి సారించలేదు. తోటపల్లి, జంఝావతి, వట్టిగెడ్డ ప్రాజెక్టుల పరిధిలోని రైతులు గత ఐదేళ్లుగా సాగునీటికి పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనులపై సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెచ్చినా ఫలితం లేదు. పెండింగ్‌లో ఉన్న బకాయిలు విడుదల చేస్తేనే పనులు ప్రారంభిస్తామని, లేదంటే నిర్వహించలేమని కాంట్రాక్టర్లు ఖరాఖండిగా చెప్పడంతో అధికారులు ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంది. పనులైనా చేయండి, లేదంటే రబీ పంటలకు సాగునీటిని విడుదల చేయాలని పలు దఫాలు రైతులు డిమాండ్ చేసినా అధికారులు స్పందించలేదు. ఆఖరుకు పనులు నిర్వహించని పరిస్థితి నెలకొనడంతో ఎడమ ప్రధాన కాలువ నుంచి నీటిని విడుదల చేశారు. దీంతో ఆధునికీకరణ పనులు నిర్వహించలేని స్థితిలో అధికారులు ఉన్నారని రైతులు గ్రహించారు. ఇప్పటికే రెండు కాలువల పరిధిలో అధికంగా గండ్లు పడ్డాయి. దీంతో రానున్న ఖరీఫ్‌కు ఇబ్బందులు తప్పేటట్లుగా లేదని పలువురు రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 103.20 మీటర్ల నీటి నిల్వ సామర్థ్యం ఉండగా ఎడమ ప్రధాన కాలువ నుంచి 50 క్యూసెక్కులు, కుడి ప్రధాన కాలువ నుంచి 50 క్యూసెక్కులు, పాత రెగ్యులేటర్ పరిధిలోని కుడి కాలువ నుంచి 60 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. నదిలోకి ఎగువ ప్రాంతం నుంచి 416 క్యూసెక్కుల నీరు రాగా, నదీ తీర ప్రాంత కాలువలకు 140 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



ఎడమ ప్రధాన కాలువ నుంచి నీరు విడుదల చేసిన దృశ్యం

విద్యార్థుల మృతికి కారణమేంటి?

- మరణ మృదంగంపై కదిలిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు
- కలెక్టర్, పీవో ఆదేశాలతో పాఠశాలల్లో విచారణ

పార్వతీపురం (ఆంధ్రజ్యోతి) / గుమ్మలక్ష్మీపురం/ సీతంపేట, ఫిబ్రవరి 22: గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల మరణాలకు గల కారణాలపై వైద్య ఆరోగ్య శాఖ విచారణ చేపడుతోంది. గురువారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన విద్యార్థుల మరణ మృదంగం కథనంపై జిల్లా యంత్రాంగం స్పందించింది. ఐదు రోజుల వ్యవధిలో మక్కువ మండలం ఎర్రసామంతవలస గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి అశోక్, పాచిపెంట మండలం సరాయివలస గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని అనిత, గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి గురుకుల పీటీజీ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న రెల్లిగూడ గ్రామానికి చెందిన బిడ్డిక శృతి చనిపోవడంతో గిరిజనులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఐటీడీఏ పీవో విష్ణుచరణ్ ఆదేశాలతో గురువారం పార్వతీపురం ఐటీడీఏ పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలలకు వైద్యులు, సిబ్బంది వెళ్లి విచారణ చేపట్టారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఐటీడీఏ పీవో విష్ణుచరణ్, వైద్యశాఖ అధికారులు గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరి కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌ను, భద్రగిరి పీటీజీ గురుకుల పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఆరా తీసి పీవో తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. సీతంపేట మండలంలోని కుశిమి, దోనుబాయి పీహెచ్‌సీలతో పాటు స్థానిక ఏరియా ఆస్పత్రిని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు తనిఖీ చేశారు. గిరిజన సంక్షేమ వసతి గృహాలను సందర్శించి సిబ్బందితో సమీక్షించారు. విద్యార్థుల ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. సిక్ రూమ్‌లో ఉన్న విద్యార్థులతో మాట్లాడారు. ప్రతిరోజూ విద్యార్థుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని ఆదేశించారు. మలేరియా, డెంగ్యూ వ్యాధి నిర్ధారణ అయితే సత్వరమే చికిత్స అందించాలన్నారు. దోమల ఆవాస ప్రాంతాల్లో స్ప్రేయింగ్ చేయించాలని తెలిపారు.



గురుకుల బాలికల పాఠశాల సిబ్బందితో మాట్లాడుతున్న వైద్యశాఖ అధికారులు



కుశిమి పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి

ఇద్దరు వార్డెన్ల సస్పెన్షన్

సాలూరు, ఫిబ్రవరి 22: పాచిపెంట మండలం సరాయివలస గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల వార్డెన్ విజయలక్ష్మిని, మక్కువ మండలం ఎర్రసామంతవలస గిరిజన ఆశ్రమ పాఠశాల వార్డెన్ ఎం.చంద్రరావును సస్పెండ్ చేసినట్లు గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు (డీడీ) రుగ్మతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల మృతి చెందిన విద్యార్థులు అశోక్, అనితకు సంబంధించి వార్డెన్లు నిర్లక్ష్యంగా విధులు నిర్వహించిన కారణంగా వారిని సస్పెండ్ చేసినట్లు చెప్పారు. గుమ్మలక్ష్మీపురం మండలం భద్రగిరి గురుకుల పీటీజీ పాఠశాల విద్యార్థిని బిడ్డిక శృతి మృతిపై విచారణ చేపడుతున్నామని, సిబ్బంది నిర్లక్ష్యం కనిపిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రైతులకేదీ సహకారం?

- పక్కదారి పట్టిన పీఏసీఎస్‌లు
- అన్నదాతలకు దూరమవుతున్న సేవలు
- పెరిగిన సభ్యత్వ రుసుం.. ఎన్నికల ఖర్చు
- వ్యాపార ధోరణిలో సంఘాలు

రాజాం, ఫిబ్రవరి 22: ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు లక్ష్యానికి భిన్నంగా నడుస్తున్నాయి. రైతుల కోసం ఏర్పాటైన సంఘాలు వ్యాపార ధోరణిలోకి వెళ్లిపోతున్నాయి. పీఏసీఎస్‌ల్లో 50 శాతం వాటాలు ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలన్న ప్రభుత్వ నిర్ణయం రైతుల పాలిట శాపంగా మారనుంది. క్రమేపీ రైతు సేవల నుంచి ప్రాథమిక వ్యవసాయ సంఘాలు తప్పుకున్నట్లు అవుతోంది. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాలకు అధికారాలు కట్టబెట్టడంతో పీఏసీఎస్‌లు ఉత్సవ విగ్రహాలుగా మారిపోయాయి. ఇప్పుడు ప్రైవేటు పరం చేయాలన్న ప్రయత్నాలతో మరింత నిర్వీర్యం కానున్నాయి. ఈ పరిణామాలతో అందులో పనిచేసే ఉద్యోగులూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి విజయనగరం జిల్లాలో 92 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయి. ఇవన్నీ రైతు సేవలోనే ఉండేవి. తొలుత ఎటువంటి రుసుం చెల్లించకుండానే రైతులు ఈ సంఘాల ద్వారా పంట రుణాలు, ఎరువులు పొందేవారు. పంట ఉత్పత్తులు విక్రయించిన తరువాత తిరిగి చెల్లించేవారు. అక్కడకు కొద్దిరోజుల తరువాత సభ్యత్వ రుసుం కింద రూ.10 వసూలు చేసేవారు. సంఘం సభ్యులు ప్రాంతీయ వ్యవసాయ కోఆపరేటివ్ బ్యాంకుల నుంచి కూడా పంట రుణాలు పొందేవారు. ప్రస్తుతం పీఏసీఎస్‌ల్లో రైతుల సభ్యత్వం తగ్గిపోయింది. సభ్యత్వ రుసుం ఏకంగా రూ.300కు పెరిగింది. మరోవైపు పీఏసీఎస్ కార్యవర్గ ఎన్నికల ఖర్చు పంచాయతీ ఎన్నికలకు మించుతోంది. దీంతో పీఏసీఎస్‌ల్లో అవినీతి కూడా పెరిగిపోయింది.

సహకార ఉద్యమంతో..

దేశంలో 19వ శతాబ్దంలోని చివరి రోజుల్లో సహకార ఉద్యమం ఎగసిపడింది. గ్రామాల్లో రైతులను వడ్డీ వ్యాపారులు పిప్పిచేయడంతో రైతులు ఉద్యమ బాట పట్టారు. దీంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయంగా సహకార వ్యవస్థను తీసుకురాక తప్పలేదు. నాబార్డు... రాష్ట్ర సహకార బ్యాంకులకు రుణాలు ఇస్తే.. అక్కడ నుంచి జిల్లా సహకార బ్యాంకులకు, అటు తరువాత ప్రాంతీయ కోపరేటివ్ బ్యాంకులకు రుణాలు సర్దుబాటు చేస్తారు. కానీ ఏపీలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సహకార వ్యవస్థకు నిధుల సర్దుబాటు నిలిచిపోయింది. నవరత్నాలకే అన్ని నిధులు మళ్లిస్తుండడంతో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. విత్తనాలు, ఎరువుల సరఫరా సైతం తగ్గిపోయింది.

రైతులకు దూరమైన 'డీసీసీబీ'

జిల్లాలో సహకార బ్యాంకుగా ఉన్న డీసీసీబీ రైతు సేవలకు దూరమైంది. సాధారణ వాణిజ్య బ్యాంకులా మారిపోయింది. రాజకీయ విభాగంగా కూడా ఆరోపణలు ఎదుర్కొంటోంది. కంప్యూటరీకరణతో పాటు వసతుల పరంగా మెరుగుపడినా రైతులపరంగా ఆశించిన స్థాయిలో పనిచేయడం లేదు. ప్రైవేటుపరం చేయడానికి కూడా ప్రయత్నిస్తున్నారని తెలియడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. 1964 నాటి సహకార చట్టానికి సవరణ చేసి కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. అవి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను నిర్వీర్యం చేసేలా ఉన్నాయి. వీటితో రైతులతో పాటు వాటిలో పనిచేసే ఉద్యోగులకు సైతం ఇబ్బందిగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ కారణంతోనే పీఏసీఎస్ ఉద్యోగులు కొద్దిరోజుల కిందట ఉద్యమ బాట పట్టారు.



రాజాం పీఏసీఎస్ కార్యాలయం

డోకులగూడ రహదారిపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భామిని/సీతంపేట, ఫిబ్రవరి 22: భామిని మండలం బాలేరు పంచాయతీ పరిధిలోని డోకులగూడ రహదారి పనులపై విచారణ చేపట్టాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. ఈ నెల 9న 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన 'రాళ్లు పేల్చకుండానే బిల్లు చెల్లించేశారు' కథనంపై కలెక్టర్ స్పందించారు. ఈ మేరకు విచారణ చేపట్టి నివేదిక అందించాలని ఐటీడీఏ పీవోను ఆదేశించారు. ఈ మేరకు విచారణ అధికారిగా పాలకొండ ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణమూర్తిని నియమిస్తూ పీవో ఆదేశాలు జారీ చేశారు. ఆయన గురువారం డోకులగూడ రహదారి పనులు పరిశీలించి గ్రామస్థులతో మాట్లాడారు. పనుల్లో భాగంగా కొండలపై రాళ్లు పేల్చాల్సి ఉందని, కానీ, రాళ్లు పేల్చకుండానే కాంట్రాక్టర్‌కు రూ.35లక్షల బిల్లులు చెల్లించేశారని గ్రామస్థులు వివరించారు. దీనిపై విచారణ అధికారి కృష్ణమూర్తి వివరణ కోరగా.. 'రహదారి పనులను పరిశీలించాం. నివేదికను పీవోకు అందిస్తా'మని తెలిపారు.

మౌలిక సదుపాయాలు కల్పించండి

విజయనగరం దాసన్నపేట: నగరంలోని వైఎస్సార్ నగర్‌లో పూర్తి స్థాయిలో తాగునీరు, మురుగు కాలువలు, సిమ్మెంట్ రోడ్లు ఏర్పాటు చేయలేదని, తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించాలని నవయువ సమాఖ్య జిల్లా అధ్యక్షులు ఎం.అప్పలరాజు, నగర కన్వీనర్ గిరి ప్రసాద్‌లు డిమాండ్ చేశారు. కాలువలు, రోడ్లు, నీటి వసతి కల్పించాలని కోరుతూ గురువారం నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేసి అధికారులకు వినతిపత్రం అందించారు. తక్షణమే పూర్తి స్థాయిలో వసతులు కల్పించాలని, లేని పక్షంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

నేడు, రేపు తాగునీరు బంద్

శృంగవరపుకోట: శృంగవరపుకోటకు శుక్ర, శనివారాల్లో తాగునీటి సరఫరా ఉండదని తాటిపూడి పైలట్ ప్రాజెక్టు జేఈ శైలజ తెలిపారు. ఈ ప్రాజెక్ట్ హెడ్ వర్కు వద్ద ఏర్పడిన సాంకేతిక లోపంతో తాగునీటి సరఫరా చేయలేకపోతున్నామన్నారు. దీనిని సవరిస్తున్నామని తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి తాగునీటి సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు.

రేపు రెడ్‌క్రాస్ సొసైటీ సమావేశం

శృంగవరపుకోట: విజయనగరం జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో ఈనెల 24న జరగనున్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వార్షిక సమావేశానికి ఎస్.కోట నియోజకవర్గంలోని ప్యాట్రన్, వైస్ ప్యాట్రన్, లైఫ్ మెంబర్లు హాజరు కావాలని రెడ్‌క్రాస్ సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచి చైర్మన్ డాక్టర్ పొట్నూరు వరలక్ష్మి కోరారు. ఈ కార్యక్రమం జేసీ కార్తీక్ అధ్యక్షతన జరుగుతుందన్నారు.

రేపు మంద కృష్ణ రాక

బొబ్బిలి: స్థానిక గంటి ప్రసాదం స్మారక భవనంలో ఈ నెల 24న సాయంత్రం ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు బోగి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఇందుకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన మాదిగ, ఉపకులాల వారిని చైతన్యం చేస్తూ భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం చేస్తారని తెలిపారు. జిల్లా అధికార ప్రతినిధి పొందూరు విజయ రామారావు, నాయకులు కిల్లాడ సురేంద్రబాబు, కింతలి రాము, ఉమ్మడి జిల్లాల ఎంఎస్‌పీ అధ్యక్షుడు బొద్దాన అప్పారావు, ఎంవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కింతలి చిన్న, యువసేన అధ్యక్షుడు కింతలి చంటి పాల్గొన్నారు.

25న 'చలో పూసపాటిరేగ'

జామి: పూసపాటిరేగలో ఈనెల 25న తెలగ జాతి ఆత్మగౌరవ సభ నిర్వహిస్తున్నామని, దీనిని విజయవంతం చేయాలని మండల తెలగ జాతి ప్రతినిధి మట్టా జనార్దనరావు కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ తమను బీసీల్లో చేర్చాలని కోరుతూ ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకు పాదయాత్ర చేసిన పీవీఆర్‌కు మద్దతుగా నిలవాలని కోరారు.

విద్యార్థులు క్రమశిక్షణ అలవరచుకోవాలి

రాజాం రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ అలవరచుకోవాలని రాజాం టౌన్ సీఐ దాడి మోహనరావు సూచించారు. గురువారం రాజాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కామేశ్వరరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ స్వప్నహైందవి, కొత్తా సాయి ప్రశాంత్ కుమార్, పాలవలస శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

రాజాం రూరల్: పట్టణంలోని ఆర్‌సీఎం పాఠశాలను రాజాం మున్సిపల్ కమిషనర్ రామ అప్పలనాయుడు గురు వారం పరిశీలించారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్ని కలకు సంబంధించి పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు సరిపడేలా సౌకర్యాలు ఉన్నాయో లేదో నని ఆరాతీశారు. అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఏఈ వెంకటన్‌ను కమిషనర్‌ను ఆదే శించారు.ఆయన వెంట శానిటరీ అధికారి ప్రసాద్ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజాం: స్థానిక శ్రీకాకుళం రోడ్డులోని సబ్‌స్టేషన్‌లో రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని నిర్వహణ పనులు చేపట్టనుండడంతో శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం వంటి గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని అర్బన్ విద్యుత్ శాఖ ఏఈ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం రోడ్డు, పాలకొండ రోడ్డు, బుచ్చింపేట, పొగులివలస, శారది తదితర ప్రాంతాలకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

విజయనగరం రింగురోడ్డు: నగరంలోని దాసన్నపేట సబ్ స్టేషన్‌లో నిర్మాణ పనుల కారణంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పూడి హరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫోర్టుసిటీ స్కూల్ ఏరియా, 100 ఫీట్ రింగురోడ్డు, పీసీ లే అవుట్, శ్రీనివాసానగర్, కృష్ణారాజుపురం, భగవాన్ నగర్, ఐస్‌ఫ్యాక్టరీ జంక్షన్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

నేడు ఆశీలు వేలం పాట

రాజాం రూరల్: మునిసిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆశీలు వేలంపాటలు నిర్వహించనున్నట్లు కమిషనర్ రామ అప్పలనాయుడు ఒకప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు నిబంధనలకు లోబడి పాటలో పాల్గొనాలని కోరారు. ఇప్పటికే రెండుసార్లు వేలం పాటలు నిర్వహించారు. ప్రభుత్వం నిర్ణయించి న ధరతో పాటు జీఎస్టీ అదనంగా కలిపి ధర నిర్ణ యించడంపై కాంట్రాక్టర్లు వెనక్కి తగ్గారు. జీఎస్టీ లే కుండా వేలం పాట ధర నిర్ణయించాలని కాంట్రాక్టర్లు ఇప్పటికే మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

ప్రసాదం ధరపై అభ్యంతరాలుంటే చెప్పండి

రాజాం రూరల్: పోలిపల్లి పైడితల్లి అమ్మవారి జాతరలో ప్రసాదం అమ్మకాలకు సంబంధించి నిర్ణయించిన ధరపై ఎవ్వరికైనా అభ్యంతరాలు ఉంటే కార్యాలయ పనివేళల్లో తెలియజేయాలని ఆలయం ఈవో బలివాడ మాధవరావు ఒక ప్రకటనలో కోరారు. పులి హోరప్రసాదం ధర రూ.10గా, లడ్డు ధరను రూ.15 గా నిర్ణయించినట్లు ఈవో తెలిపారు. జాతర మార్చి 17 నుంచి 19 వరకూ నిర్వహించనున్న విషయం తెలిసిందే.

షాపుల అద్దెలు తగ్గించాలి

రాజాంరూరల్: షాపుల అద్దెలు తగ్గించాలని, బస్టాండ్‌లో స్థలాలు ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటున్న షాపులను తొలగించాలని అద్దె చెల్లిస్తున్న వ్యాపారులు కోరారు. ఈ మేరకు రాజాం మునిసిపల్ కమిషనర్ రామ అప్పలనా యుడికి అద్దెదారులు గురువారం వినతిపత్రం అందజేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రారంభించిన నేపథ్యంలో బస్సులు బస్టాండ్‌లోకి రాకపోవడంతో వ్యాపారాలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయని, దీంతో గతంలో నిర్ణయించిన అద్దెలు చెల్లించే పరిస్థితుల్లో లేమని కమిషనర్‌కు వ్యాపారులు వివరించారు.

మౌలిక వసతులు కల్పించండి

జామి: ఉపాధి వేతనదారులకు పని ప్రదేశంలో మౌలిక వసతులు కల్పించాలని ఎంపీడీవో తిరుమలరావు ఆదేశించారు. గురువారం అట్టాడలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు.

టీడీపీతోనే భవిష్యత్తు

- గ్రామాల్లో 'భవిష్యత్తుకు గ్యారెంటీ..'
- ప్రజల్లోకి మినీ మేనిఫెస్టో

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 22: టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు సాధ్యమని విజయనగరం టీడీపీ విజయనగరం నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతిరాజు అన్నారు. గురువారం నగరంలోని 27, 26 డివిజన్ల పరిధిలోని జొన్నగుడ్డి, ఉప్పరవీధి, ఎరుకల వీధి, బారికవీధి, రుప్పవీధి, మధ్యవీధి, పెద్దవీధి, కోరాడవీధి, ఎలుగుబంటి వారి వీధి, తుపాకుల వీధి తదితర ప్రాంతాల్లో పర్యటించి, చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలను స్థానిక పార్టీ శ్రేణులతో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం ఈ వర్గాల కోసం ఏర్పాటు చేసిన 50 పైగా పథకాలను రద్దు చేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు, గ్యాస్, పెట్రోలు, డీజిల్, ఆర్టీసీ చార్జీలు, కాయగూరల ధరలు ఆకాశాన్నంటాయన్నారు. ధరలు నియంత్రించలేని అసమర్థ ప్రభుత్వంగా ఈ ప్రభుత్వం పేరు తెచ్చుకుందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి ప్రజలు మద్దతు ఇవ్వాలని ఆమె అభ్యర్థించారు. కార్యక్రమంలో ఆయా డివిజన్ల టీడీపీ నాయకులు కంతా మీనాకుమారి, విజ్జపు వెంకటలక్ష్మి, దేవరాపల్లి రామపైడి, గంటా సువర్ణరావు, రొబ్బి కనకరాజు, సారిపల్లి బాబురావుతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● విజయనగరం మండల పరిధిలోని సుంకరిపేటలో గురువారం సాయంత్రం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అదితి గజపతి రాజు హాజరై, ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ హామీలను వివరించారు. ఈ కార్యక్రమం అనంతరం సుంకరిపేట గ్రామంలో మండల టీడీపీ నాయకులు బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు ఆధ్వర్యంలో రచ్చబండ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుంకరి సన్యాసమ్మ, సుంకరి శ్రీను, బొడ్డు సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విజయనగరంలో అదితి గజపతిరాజు ఆధ్వర్యంలో..



దత్తిరాజేరులో..



సీతానగరంలో..

దత్తిరాజేరు: చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు ఉంటుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఏ నాయుడు అన్నారు. టి.బూర్జవలస గ్రామంలో గురువారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్ 6 పథకాల కరపత్రాలను పంపిణీ చేసి, మినీ మేనిఫెస్టో వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లికి వందనం ద్వారా ఇంటిలో చదువుతున్న ప్రతిఒక్కరికీ ఏటా రూ.15వేలు, ఆడబిడ్డ నిధి ద్వారా ప్రతినెలా రూ.1500, అన్నదాతలకు ఏటా రూ.20వేలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగ యువతకు యువగళం ద్వారా ఉద్యోగాల కల్పన, దీపం పథకం ద్వారా ఏటా 3 సిలెండర్లు ఉచితంగా అందజేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు పెద్దింటి మోహన్, వేమిలి చైతన్యబాబు, క్లస్టర్ ఇన్‌చార్జిలు మజ్జి మహేష్, బెజవాడ బంగారునాయుడు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం: పాపమ్మవలస, సుభద్ర పణుకువలస, శివరాంపురం గ్రామాల్లో గురువారం బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జి బోనెల విజయ్‌చంద్ర గ్రామాల్లో ఇంటింటికి తిరిగి మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలు ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. రాష్ట్రాన్ని కాపాడాలంటే టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బలిజిపేట మండల పార్టీ అధ్యక్షుడు పెంకి వేణుగోపాల్ నాయుడు, రౌతు వేణుగోపాల్ నాయుడు, మరడాన గౌరునాయుడు, పోత సత్యనారాయణ, బొమ్మినాయుని లక్ష్మణరావు, బూరాడ చిరంజీవి, నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులు హేయం

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 22: ప్రజలకు జరుగుతున్న అన్యాయాలు, దోపిడీలపై నిష్పక్షపాతంగా వార్తలు రాస్తున్న జర్నలిస్టులపై దాడులు చేయడం అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని అవమానించడమేనని ఏపీ గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ అన్నారు. జర్నలిస్టులపై దాడులకు నిరసనగా గురువారం కలెక్టరేట్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిందితులను తక్షణమే శిక్షించి, జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. నిజాన్ని నిర్భయంగా రాస్తున్న విలేకరులపై దాడులు చేయడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కేదారిశెట్టి సత్యనారాయణ, మహిళా అధ్యక్షురాలు చోళ రాజకుమారి, పట్టణ అధ్యక్షుడు మద్దిల సోంబాబు, ఉపాధ్యక్షులు పైడితల్లి తదితరులు పాల్గొన్నారు.

రాజాం: పాత్రికేయులపై దాడి హేయమైన చర్య అని టీడీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ సహాయ కార్యదర్శి నవలాపురం వెంకటరమణ మాదిగ తెలిపారు. గురువారం రాజాంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ పై దాడి చేసని ఘటన చాలా దారుణమన్నారు. ఇలాంటి దాడులు రాష్ట్రంలో ఒక్క జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మా త్రమే జరిగాయన్నారు. పత్రికలో వచ్చిన వార్తలు ఏమైనా ఇబ్బంది అనుకుంటే న్యాయ సహాయం కోరాలి గాని దిగజారుడు రాజకీయాలు చేయడం దుర్మార్గమైన చర్య అని ఆందోళన వ్యక్తంచేశారు. దాడికి పా ల్పడిన వారిని తక్షణమే అరెస్ట్ చేసి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



నిరసన తెలియజేస్తున్న గోసంరక్షణ సమితి ప్రతినిధులు

ముగిసిన ఖాదర్ బాబా గంధ మహోత్సవం

విజయనగరం (ఆంధ్రజ్యోతి), ఫిబ్ర వరి 22: నగరంలోని బాబామెట్ట వద్ద గల ఖాదర్‌బాబా దర్గాలో జరుగుతున్న 65వ గంధ మహోత్సవాలు గురువా రంతో ముగిశాయి. మూ డు రోజుల పాటు ఘనంగా జరిగిన ఈ ఉత్సవాల్లో దేశం నలుమూలల నుంచి సూఫీ భక్తులు పాల్గొన్నారని ఖలీలుల్లా షరీఫ్ (ఖలీలుబాబు) చెప్పారు. విచ్చేసిన భక్తులు దర్గాలో సుగంధ, చాదర్ సమర్పించి తమ మొక్కులు చెల్లించుకు న్నా రని తెలిపారు. సూఫీ పరంపర కొనసాగాలని, మహనీయులను స్మరించుకుంటూ విశ్వశాంతి కోసం దర్గాలో ప్రార్థనలు చేశారని తెలిపారు. గంధ మ హోత్సవాలు ముగింపు సందర్భంగా టీడీపీ సీనియర్ నాయకుడు అశోక్ గజపతిరాజు, జడ్పీ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, నగర పాలక సంస్థ మేయర్ వీవీ లక్ష్మీ, టీడీపీ నేతలు పిల్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్ తదితరులు పాల్గొని, బాబాకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి చాదర్, సుగంధ పుష్పాలు, చందనం సమర్పించారు.



బాబాకి ప్రార్థనలు చేస్తున్న అశోక్ గజపతిరాజు తదితరులు

విజయనగరం దాసన్నపేట: ఖాదర్‌బాబా దర్గాని జనసేన నాయకులు గురాన అయ్యలు, చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావులు గురువారం దర్శించుకున్నారు. దర్బార్ నిర్వహకులు మహ్మద్ ఖలీలుల్లా షరీఫ్ వీరికి దర్గా ఆచారం మేరకు శాలువాతో సత్కరించారు.

వైసీపీ హయాంలో ముస్లింల సంక్షేమం ఏదీ?

- టీడీపీ మైనారిటీ సెల్ నాయకులు

విజయనగరం రూరల్, ఫిబ్రవరి 22: ముస్లింల సంక్షేమానికి ఈ ప్రభుత్వం కృషి చేయలేదని, ఎన్నికలు సమీపిస్తుండడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు ముస్లింల సంక్షేమం గురించి మాట్లాడుతున్నారని టీడీపీ మైనార్టీ సెల్ నాయకులు ఎస్‌కేఎం భాషా, షేక్ భాషా విమర్శించారు. టీడీపీ మైనార్టీ సెల్ నాయకులు సిద్దిక్, అక్బర్, ఎస్‌కే జానీ, జహంగీర్ భాషాతో కలిసి గురువారం పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పాదయాత్ర సమయంలో ముస్లింలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నోటికొచ్చిన హామీలు ఇచ్చారన్నారు. ముస్లిం ఓటర్లు ఆ మాటలు నమ్మి ఓటేశారన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక ముస్లింల సంక్షేమాన్ని విస్మరించారన్నారు. విజయనగరంలో ముస్లింలు వినియోగించే షాదీఖానా మరమ్మతులకు టీడీపీ హయాంలో రూ. 10 లక్షలు నిధులు విడుదల చేస్తే, నాలుగేళ్ల పది నెలల కాలంలో ఈ ప్రభుత్వం, ముఖ్యంగా విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి షాదీఖానాకు సున్నం వేసేందుకు కూడా నిధులు ఇవ్వలేదన్నారు. జగన్మోహన్‌రెడ్డి నమ్మించి, నట్టేట ముంచారని, ఈ పర్యాయం ముస్లింలు అంతా టీడీపీవైపే చూస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన విజయానికి ముస్లింలు సహకరించాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కొనసాగుతున్న జిందాల్ భూ నిర్వాసితుల నిరసన



దీక్షలో జిందాల్ భూనిర్వాసితులు

శృంగవరపుకోట రూ రల్, ఫిబ్రవరి 22: మండలంలోని కిల్తం పాలెం జిందాల్ కార్యాల యం వద్ద తమకు జిందాల్ కంపెనీ న్యా యం చేయాలని కోరుతూ చేస్తున్న దీక్షలు మూడోరో జుకు చేరాయి. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ తమకు షేర్‌ధనం పెంచాలని, త్వరలో పెడతామన్న కంపెనీల్లో తమకు అన్ని రకాల భద్రతపై హామీ ఇప్పించాలని, యాజమాన్యం తమతో మాట్లాడాలని కోరారు. వీరికి మద్దతుగా ఎంపీపీ సోమేశ్వరరావు దీక్షలో కూర్చుని బాధితులకు న్యాయం జరిగేవరకు మీ వెంట ఉంటామన్నారు.

ఎండీఎం నిర్వాహకుల సమస్యలు పరిష్కరించాలి

కొత్తవలస, ఫిబ్రవరి 22: మధ్యాహ్నభోజన నిర్వాహకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లా సీపీఎం నాయకుడు గాడి అప్పారావు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మండల విద్యాశాఖాధికారి బండారు శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాతే నిర్వాహకుల సమస్యలు ఎక్కువయ్యాయని గాడి అప్పారావు అన్నారు. ప్రమాద బీమా సౌకర్యం, అగ్నిప్రమాదాలకు గురైతే నష్ట పరిహారం చెల్లించాలని, తదితర డిమాండ్లను పరిష్కరించాలన్నారు. ఎండీఎం నిర్వాహకులు పాల్గొన్నారు.



వినతి పత్రం ఇస్తున్న నిర్వాహకులు

డ్రైనేజీలు శుభ్రపరచకపోతే ఎలా?

బొబ్బిలి, ఫిబ్రవరి 22: బొబ్బిలి పట్టణ పరిధిలోని పూల్‌బాగ్, మహారాణిపేట, సాలావా రితోట ప్రాంతాల్లో డ్రైనేజీలో పెద్దఎత్తున చెత్తా చెదారాలు పేరుకుపోవడంతో మున్సిపల్ కమిష నర్ లాలం రామలక్ష్మి అసంతృప్తి వ్యక్తం చేశారు. వార్డు పర్యటనలో భాగంగా ఆమె గురువారం పలు వార్డుల్లో పారిశుద్ధ్య నిర్వహణ, ఇంటింటి చెత్తసేకరణ, తడి, పొడిచెత్త బుట్టల వినియోగంపై ఆరాతీశారు. తడి, పొడిచెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందివ్వాలని స్థానికులకు ఆమె అవగాహన కల్పించారు. చెత్తను సేకరించే తోపుడుబళ్ల పనితీరు తెలుసుకున్నారు. అప్పయ్యపేటలో మురుగుకాలువలు అధ్వానంగా ఉండడంతో వాటిని పరిశుభ్రం చేయాలని శానిటరీ సూపర్‌వైజర్లను ఆదేశించారు.



కాలువలను పరిశీలిస్తున్న కమిషనరు రామలక్ష్మి

సంక్షేమ చట్టం తీసుకురావాలి

విజయనగరం దాసన్నపేట, ఫిబ్రవరి 22: రవాణా రంగ కార్మికులకు సామాజిక సంక్షేమ చట్టం చేయాలని ఆల్ ఇండియా ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మయ్య డిమాండ్ చేశారు. గురువారం ఎల్‌బీజీ భవనంలో ఏర్పాటు చేసిన ఆటో రవాణా రంగ సదస్సులో ఆయన మాట్లాడుతూ రవాణా కార్మికు లు కరోనా సమయంలో మందుల రవాణా చేయడం, బాధితులను ఆస్ప త్రులకు తీసుకువెళ్లడంలో చేసిన కృషి గణనీయమైనదన్నారు. కార్యక్రమంలో ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్ జిల్లా కన్వీనర్ ఎ.జగన్మోహన్, సీఐటీయూ నగర కార్యదర్శి బి.రమణ, ఉపాధ్యక్షులు రెడ్డి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మయ్య

రైతుల ఉద్యమానికి మద్దతుగా ధర్నా

బొబ్బిలి: రైతాంగ సమస్యలపై ఢిల్లీలో గట్టి పోరాటం చేస్తున్న రైతులకు మద్దతుగా గురువారం బొబ్బిలి మండలం రంగరాయపురం గ్రామంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు ఎస్.గోపాలం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించే పంటలకు కనీసమద్దతు ధర కల్పించాలని, కేంద్రప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని రైతులు చలో ఢిల్లీకి పిలుపునిచ్చారన్నారు. దేశీయ వ్యవసాయరంగాన్ని పూర్తిగా అంబానీ, అదానీలకు కట్టబెట్టాలని బీజేపీ కుట్ర పన్నుతోందని, అందుకే రైతు చట్టాలను అమలు చేయడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఉడమల ప్రసాద్, భూషణం, సాంబయ్య, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



రంగరాయపురంలో ధర్నా చేస్తున్న రైతులు

కొత్తవలసలో రైళ్లకు హాల్ట్ కల్పించాలి

కొత్తవలస, ఫిబ్రవరి 22: కొత్తవలస రైల్వేస్టేషన్‌ను అమృత భారత్ పథకంలో ఎంత చక్కగా తీర్చిదిద్దినా రైళ్లు స్టేషన్‌లో ఆగక పోతే ఏం ప్రయోజనమని సీపీఐ శృంగవరపుకోట డివిజన్ కార్యదర్శి డేగల అప్పలరాజు అన్నారు. గురువారం కొత్తవలస రైల్వేస్టేషన్‌లో రైళ్లకు హాల్ట్ కల్పించాలని కోరుతూ స్థానిక ప్రయాణికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కరోనాకు ముందు కొత్తవలస రైల్వేస్టేషన్‌లో వివిధ రైళ్లకు హాల్ట్ ఉండేదని తరువాత వాటిని ఎత్తేశారన్నారు. కేంద్రప్రభుత్వం కొత్తవలస రైల్వేస్టేషన్‌ను అమృత భారత్ రైల్వేస్టేషన్‌గా గుర్తించి వివిధ సౌకర్యాలను కల్పిస్తోందని, కానీ ఇక్కడ రైళ్లు ఆగకపోతే ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరు-రాయగడ రైలుతోపాటు, ప్రశాంతి, కోర్బా, ఇంటర్‌సిటీ రైళ్లకు హాల్ట్‌కు కల్పించాలని డిమాండ్ చేశారు. భవత్‌కోటి, హతీయా ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్ట్ కల్పించాలన్నారు. ఈ మేరకు సంతకాల సేకరణ చేశారు. ఈనెల 26న కొత్తవలస రైల్వేస్టేషన్‌కు రానున్న డీఆర్‌ఎంకు వినతి పత్రం ఇచ్చేందుకు హాజరుకావాలని కోరారు.



రైల్వేస్టేషన్‌లో నిరసన చేస్తున్న దృశ్యం

గ్రోత్ సెంటర్ పరిస్థితి దారుణం

బొబ్బిలి, ఫిబ్రవరి 22: బొబ్బి లి గ్రోత్ సెంటరులో మౌలిక సదు పాయాలన్నీ దాదాపు కనుమరుగవుతున్నా యని... ఇక్కడ పరిశ్ర మలు పెట్టేందుకు ఎవరు ముందుకొస్తారని లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆకుల దామోధర రావు ప్రశ్నించారు. ప్రజా సంకల్ప వేదిక ప్రతినిధి సురేష్‌తో కలిసి గ్రోత్ సెంటర్‌ను గురువారం ఆయన పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రోత్ సెంటరులో ప్రధాన రహదారులన్నీ అధ్వానంగా తయారయ్యాయన్నారు. విద్యుత్ దీపాలు సక్ర మంగా లేవని, పచ్చదనం పూర్తిగా లేకుండా పోయిందన్నారు. వెనుకబడిన ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవే ర్చడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదనడానికి గ్రోత్ సెంటర్ ప్రబల తార్కాణంగా నిలుస్తుందన్నారు. గ్రోత్ సెంటర్ ముఖద్వారం ముందు పారిశ్రామికవాడకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విలువైన వ్యవసాయ భూములను కోల్పోయిన రైతులకు ఉపాధి అవకాశాలు కల్పించేలా గ్రోత్‌సెంటర్‌ను తీర్చిదిద్దాలని దామోదరరావు డిమాండ్ చేశారు.



రోడ్ల దుస్థితిని చూపుతున్న దృశ్యం

'సూపర్ సిక్స్'పై అవగాహన కల్పించండి: కోండ్రు

రాజాం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు రూపకల్పన చేసిన మినీ మేనిఫెస్టోలో ఉన్న బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరించి, ప్రతిఇంటికీ వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించాలని రాజాం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కోండ్రు మురళీమోహన్ కోరారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో నాయకులు సమాయత్తంకావాలని కోరారు. గురువారం శ్యాంపురం క్యాంపుకార్యాలయంలో వంగర మండలం లోని నీలయావలస, మరువాడ, కింజంగి, మద్దువలస, శ్రీహరిపురం, రాజులగుమ్మడ, 4, 6. 8, 9 వార్డుల నాయకులు, వార్డు కమిటీ సభ్యులతో సమీక్షించారు. ప్రతిఒక్కరూ పార్టీ గెలుపునకు కృషిచేయాలని కోరారు. బొత్స వాసుదేవరావునాయుడు. పి న్నింటి మోహన్‌రావు. కె రవి, యలకల రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కోండ్రు

అధిక ధరలకు అమ్మితే చర్యలు

విజయనగరం రింగు రోడ్డు, ఫిబ్రవరి 22: ఆహారపదార్థాలపై ఉన్న ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్ప వని తూనికలు, కొలతలు శాఖ ఇన్‌స్పెక్టర్ ఎం.దామోధర నాయుడు హెచ్చరించారు. నగరంలోని చాకలిపేట, రామునారాయణం తదితర ప్రాంతాల్లో పాలప్యాకెట్లు, కూల్ డ్రింక్స్ స్టాల్స్‌లో గురువారం తనిఖీలు చేపట్టారు. స్టాల్స్‌లో అధిక ధరలకు విక్రయం, తూకంలో తేడాలు ఉన్నట్టు గుర్తించి నిర్వాహకులపై ఏడు కేసులు నమోదు చేశారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.



స్టాల్స్ నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్న అధికారులు

విజయనగరంలో నిరుద్యోగ ఓదార్పు యాత్ర

విజయనగరం రూరల్: దగా పడ్డ నిరుద్యోగ యువతను ఓదార్చే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఓదార్పు యాత్ర గురువారం విజయనగరానికి చేరుకుంది. ఈ యాత్ర నిర్వహిస్తున్న ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమంత్‌కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో నిరుద్యోగులకు ఈ ప్రభుత్వం మొండి చేయి చూపిందన్నారు. క్రమం తప్పకుండా జాబ్ క్యాలెండర్ అంటూ హామీ ఇచ్చి, ఈ విషయంలో మాట తప్పి, మడమ తిప్పారన్నారు. రాష్ట్ర వ్యా ప్తంగా ఖాళీగా ఉన్న 2 లక్షల 32 వేల ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. లక్ష ఉ ద్యోగాలతో మెగా డీఎస్సీ, 26 వేల ఉద్యోగాలతో పోలీసు శాఖతో పాటు పలు శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. మార్చి 17న రెండు పరీక్షలు ఒకే పర్యాయం ఏర్పాటు చేశారని, రెండు పరీక్షలకు సంబంధించి వేర్వేరు తేదీలను ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ఓదార్పు యాత్ర చేస్తున్న దృశ్యం

కృష్ణ మాస్టారి సేవలు మరువలేనివి

తెర్లాం, ఫిబ్రవరి 22: ఉపాధ్యాయుడు, మాజీ సర్పంచ్ ఏగిరెడ్డి కృష్ణ మరణం అటు విద్యాలోకానికి, ఇటు గ్రామీణ ప్రజానీకానికి తీరని లోటని బొబ్బిలి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి బేబీనాయన అన్నారు. గత ఏడాది జూలై నెలలో ఏగిరెడ్డి కృష్ణ మాష్టారు హత్యకు గురైన విషయం విదితమే. ఉద్దవోలులో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహావిష్కరణకు గురువారం బేబీనాయన హాజరయ్యారు. ముందుగా విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్దవోలుకు కృష్ణ మాష్టారు చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. బేబీనాయన వెంట మండల టీడీపీ నాయకులు ఉన్నారు. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు కూడా కృష్ణమాష్టారు విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న బేబీనాయన

అప్పలమ్మపేట పాఠశాల తనిఖీ

తెర్లాం: మండలంలోని అప్పలమ్మపేట ఎంపీపీ పాఠశాలను ఎంఈవో త్రినాథరావు గురువారం సందర్శించారు. ఈ మేరకు తనిఖీ బృందంతో పాఠశాల పరిసరాలను పరిశీలించారు. అనంతరం స్కూల్ రికార్డులను, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా నైపుణ్యాలను అంచనా వేశారు. సిలబస్‌ను నిర్దేశిత సమయానికి పూర్తిచేయాలన్నారు. వర్కుబుక్ కరెక్షన్, ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్ తదితరవాటిని పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

వచ్చే నెలలో లబ్ధిదారులకు ఇళ్ల అప్పగింత

బొబ్బిలి: వచ్చే నెల మొదటి వారంలో బొబ్బిలి రామన్నదొరవలస సమీపంలో నిర్మిస్తున్న 1248 టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ తెలిపారు. స్థానిక టిడ్కో కాలనీలో గురువారం ఆయన అధికారులతో సమీక్ష జరిపారు. ముందుగా కాలనీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని సదుపాయాలతో నిర్మాణాలను పూర్తి చేస్తామని, మొదటివారంలోనే లబ్ధిదారులకు అప్పగిస్తామని తెలిపారు. ఇంతవరకు రాష్ట్రవ్యాప్తంగా 1.17 లక్షల ఇళ్లను అప్పగించినట్లు తెలిపారు. 2024 కల్లా లక్షన్నర ఇళ్లను లబ్ధిదారులకు అందించే లక్ష్యంగా హౌసింగ్, మురుగునీటి శుద్ధి(ఎస్‌టీపీ) ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (రోడ్లు, మంచినీరు, డ్రైనేజీ, ఎలక్ట్రికల్)పనులను పూర్తి చేసి అన్ని సదుపాయాలతో ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని అధికారులను ఆదేశించామన్నారు. మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, టిడ్కో ఈఈజ్యోతి, డీఈఈ, సీఎల్‌టీసీ పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయానికి శంకుస్థాపన

కొత్తవలస: మండలంలోని రామలింగపురం గ్రామ పంచాయతీ పరిధిలోని మామిడి తోటల్లో వెలసిన తోటలో దుర్గమ్మ ఆలయ శంకుస్థాపన కార్యక్రమం గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఆలయ శంకుస్థాపన కార్యక్రమాన్ని ప్రముఖ వేద పండితుడు అంపోలు ఉమామహేశ్వర శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచే కాకుండా పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. సుమారు 600 మంది భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రామలింగపురం, దేవాడ, ముసిరాం గ్రామాలకు మధ్యనున్న మామిడితోటలో దుర్గమ్మ సుమారు 19 సంవత్సరాల కిందట వెలియడంతో తోటలో దుర్గమ్మగా ప్రసిద్ధి గాంచింది.

రచయిత గురుప్రసాద్‌కు జాతీయ ప్రతిభా పురస్కారం

విజయనగరం దాసన్నపేట: అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత, తెలుగుభాష పరిరక్షణ సమితి అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. రాజమహేంద్రవరంలో దర్మంచల కమ్యూనిటీ హాల్లో ఏపీ మీడియా అకాడమీ కార్యదర్శి బాలగంగాధర్ తిలక్ చేతుల మీదుగా దీనిని అందుకున్నారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కుడిపూడి పార్థసారధి, పి.రాజారావు, తదితరులు హాజరయ్యారు.

మాతృభాషను నిర్లక్ష్యం చేయరాదు: ప్రిన్సిపాల్

పాలకొండ: మాతృభాషను నిర్లక్ష్యం చేయరాదని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్యాంబాబు తెలిపారు. గురువారం పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాతృభాష దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్యాంబాబు మాట్లాడుతూ ప్రపంచంలో చిన్నా, పెద్దభాషలను సంరక్షించుకోవాలన్నారు. ఈ సందరంగా విద్యార్థులకు వివిధ రకాల సాహిత్య పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. కార్య క్రమంలో తెలుగు విభాగాధిపతి సీహెచ్.కుమారి, కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ బి. జయమణి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ బి.రాజు, అధ్యాపకులు కుమారి, శ్రీనివాస రావు, ఎం.శాంతి, రాఘవేం ద్రనాయుడు, జగన్మోహన్‌రావు, తిరుపతిరావు, వి.జనార్ధనరావు, పి.ఉమాసౌమిత్‌రాజు, పి.ఉపేంద్ర, ఎస్.సీతారాం, పి.జమ్మయ్య కుమారి, ఎం.ప్రశాంతి పాల్గొన్నారు.

ఎంపీగా పోటీకి సిద్ధం: డిప్యూటీ సీఎం

సాలూరు రూరల్: వచ్చే జమిలిఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసేం దుకుతాను సిద్ధంగా ఉన్నట్టు ఉపముఖ్యమంత్రి రాజన్నదొర తెలిపారు. సాలూరులో గురువారం నిర్వహించిన వలంటీర్ల సత్కార కార్యక్రమం లో మాట్లాడారు. ఎంపీగా పోటీకే మక్కువ చూపుతున్నానని, తన అభి లాషను అధిష్ఠానానికి విన్నవించానని తెలిపారు. అధిష్ఠానం ఆదేశం మేరకు ఎంపీగా గానీ, ఎమ్మెల్యేగా గానీ పోటీకి సిద్ధమన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, గ్రంథాలయ చైర్మన్ రెడ్డిపద్మావతి, ఏఎంసీ చైర్మన్ దండి అనంతకుమారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ద్వారా ఏఎన్‌ఎంల నియామకం

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్‌ఎంలను నియమించేందుకు నేషనల్ హెల్త్ మిషన్‌కు ప్రతిపాదనలు చేశానని డిప్యూటీ సీఎం రాజన్నదొర తెలిపారు. ఆంధ్రజ్యోతి లో గురువారం ప్రచురితమైన మరణ మృదంగం కథనానికి ఆయన స్పందించారు. గిరిజన ఆశ్రమపాఠశాలల్లో ఏఎన్‌ఎంల నియామకానికి ఎన్‌హెచ్ ఎంకు ప్రతిపాదనలు చేశానని, అవి ఇంకా ఆమోదం పొందాల్సి ఉందన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో మరణాలు సంభవించకుండా అధికా రులు, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

జియ్యమ్మవలస: మండలంలోని చింతలబెలగాం శివారులోగల ప్రతాప్ నగర్‌కు చెందిన పొడుగు చంద్రశేఖరరావును 32 మద్యం సీసాలతో పట్టుకున్నట్లు ఎస్‌ఐ ఇ.చిన్నంనాయుడు తెలిపారు. గురువారం సాయంత్రం అతని వద్ద నుంచి మద్యం సీసాలను స్వాధీనంచేసుకుని, కేసు నమోదు చేశామని చెప్పారు.

20 మద్యం సీసాలు స్వాధీనం

కురుపాం: అక్రమంగా మద్యం తరలిస్తున్న మహిళ వద్ద నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని కురుపాం ఎస్‌ఐ షణ్ముఖరావు తెలిపారు. గురువారం మూలుగూడ జంక్షన్ వద్దకు అను మానాస్పదంగా ఉన్న మహిళను తనిఖీ చేశామన్నారు. ఈ తనిఖీల్లో ఆమె వద్ద 20 మద్యం సీసాలు గుర్తించి, పట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీ ఎల్ఎన్ దొర, మహిళ కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

గరుగుబిల్లి: పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పనులకు విధిగా సమయపాలనపాటించాలని ఎంపీడీవో పైల సూర్యనారాయణ సూచించారు. కొంకడివరం, సీతారాంపురం గ్రామాల్లో ఉపాధి పనులను గురువారం పరిశీలించారు. ఈ పరిశీలనలో ఏపీవో ఎం.గౌరీనాథ్, ఈసీ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ అధికారుల నిరసన



నిరసన తెలుపుతున్న ఇంజనీరింగ్ అధికారులు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: స్థానిక పంచాయతీరాజ్ జిల్లా ఇంజనీరింగ్ కార్యాలయం వద్ద ఆ శాఖ ఇంజనీర్లు నిరసన చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి తమ సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి కృష్ణాజీ ఆ సంఘం ప్రతినిధులు రత్నకుమార్, లక్ష్మణ్‌కుమార్, అసిస్టెంట్ ఇంజనీర్లు గంట చంద్రమౌళి, అంబేడ్కర్ తదితర ఇంజనీర్లు పాల్గొన్నారు.

ఆదివాసీలకు పోస్టులు కేటాయించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ జేఏసీ నాయకులు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: డీఎస్సీ 2024 నోటిఫికేషన్ ప్రకారం ఐదో షెడ్యూల్ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసీ అభ్యర్థులకు పోస్టులు కేటాయించాలని ఆదివాసీ జేఏసీ చైర్మన్ కె.ధర్మారావు, జాయింట్ సెక్రటరీలు దుక్క సీతారాం, కె.గౌరమ్మ, యు.తిరుపతిరావు కోరారు. ఈ మేరకు కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఐటీడీఏ పరిధిలో డిప్యూటీ డీఈవో సీనియర్ ఎవరైతే ఉపాధ్యాయులు వారితోనే తక్షణమే భర్తీ చేయాలన్నారు. భారత రాజ్యాంగం ప్రకారం 244(1) ఏ ప్రకారం 6, 7 షెడ్యూల్ ప్రాంతంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు ఉద్యోగ భర్తీ నిమిత్తం జాతీయ నిర్దిష్టం పరిచి ఉందన్నారు.

అమ్మవారి దీవెనలు ఉండాలి: ఎమ్మెల్యే



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముదిలి, అనసూయ, గౌరి

రాయగడ: రాయగడ గ్రామ దేవత బురదల పోలమ్మ తల్లి దీవెనలు అందరిపై ఉండాలని శాసన సభ్యుడు మకరంద ముదిలి అన్నారు. బురదల పోలమ్మ ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే నిధులతో నిర్మించిన నూతన సేవా కేంద్ర భవనాన్ని ప్రారం భించారు. దీనికోసం ఆయన రూ.ఐదు లక్షలు మంజూరుచేశారు. దీనితోపాటు కల్యాణమండపం నిర్మాణానికి మరో రూ.10 లక్షలు మంజూరుచేశారు. కార్య క్రమంలో ప్రత్యేక అభివృద్ధి మండలి అధ్యక్షురాలు అనసూయ మాఝి, బిజుజనతాదళ్ సీనియర్ నేత వెంకటేశ్వరరావు, (కొండబాబు), ఆమొ ఒడిశా, నవీన్ ఒడిశా రాయగడ జిల్లా సమన్వయ కర్త పట్నాన గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

మెట్రిక్ పరీక్షలు ప్రారంభం

రాయగడ: జిల్లాలో మెట్రిక్ పరీక్షలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఇందుకోసం జిల్లా విద్యాశాఖాధికారులు పటిష్ఠమైన చర్యలు చేపట్టారు. జిల్లాలో 12 వేల 351 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. దీనికోసం 59 పరీక్ష కేంద్రాలు, 59 మంది పర్యవేక్షకులు, 11 నోడల్ కేంద్రాలకు 11 మంది పరిశీలకులను, 3 స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. ఈ పరీక్షలు ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు జరుగుతాయని అధికారులు తెలిపారు.

రాయగడ చేరుకున్న ధ్వజస్తంభం

రాయగడ: జిల్లా కేంద్రానికి 15 కి.మి. దూరంలో ఉన్న శ్రీక్షేత్ర టౌన్‌షిప్‌లో ఈ నెల 24న శ్రీలక్ష్మీనృసింహ ఆలయాన్ని ప్రతిష్ఠించనున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా మైలవరం నుంచి 11 టన్నుల బరువు, 46 అడుగుల పొడవు గల ధ్వజ స్తంభాన్ని బుధవారం రాత్రి వాహనంపై ఇక్కడికి తీసుకొచ్చారు. ఈ స్తంభానికి జగన్నాథాలయం వద్ద పురోహితులు భాస్కారాచార్యులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ నెల 24 నుంచి 29 వరకు ప్రతిష్ఠోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

1 నుంచి బ్యాడ్మింటన్ పోటీలు

రాయగడ: స్థానిక ఇండోర్ స్టేడియంలో మార్చి ఒకటి నుంచి 3 వరకు బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. దీనికి ప్రవేశ రుసుం రూ.500గా నిర్ణయించారు. ఈ నెల 27 లోగా క్రీడాకారులు రుసుం చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. విజేతలకు నగదు బహుమతి అందజేయనున్నట్టు వెల్లడించారు.



కురుపాం: పథకాలపై అవగాహన కల్పిస్తున్న టీడీపీ నాయకులు



వీరఘట్టం: శంఖారావం క్యాలెండర్లను పంపిణీ చేస్తున్న నాయకులు



సీతంపేట: నౌగూడలో బాబు ష్యూరిటీ కార్యక్రమం నిర్వహిస్తున్న తోట ముఖలింగం

రాష్ట్రంలో అరాచక పాలన

- గ్రామాల్లో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ
- సూపర్‌సిక్స్ పథకాలపై టీడీపీ నాయకుల ప్రచారం

రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని టీడీపీ నాయకులు ఆరోపించారు. గురువారం జిల్లాలో బాబూ ష్యూరిటీ భవిష్యత్‌కు గారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేసి సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు.

టీడీపీ అధికారంలోకి వస్తేనే రహదారులు

సీతంపేట: దశాబ్దకాలంగా నౌగూడ గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని, తమ పార్టీ అధికారంలోకి వస్తే రహదారులు పూర్తవుతాయనే నమ్మకంతో గిరిజనులు మద్దతు ఇస్తున్నారని టీడీపీ మండలాధ్యక్షుడు సవర తోటముఖలింగం తెలిపారు. టీడీపీకే తమ మద్దతు ఉంటుందని పెదరామ పంచాయతీ పరిధిలో ఉన్న కోసుమానుగూడ, నౌగూడ, చింతమానుగూడ గ్రామాల గిరిజనులు స్పష్టంచేశారని చెప్పారు.గురువారం నౌగూడలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్య క్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐటీడీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ హిమరిక పవన్, సర్పంచ్ నీలయ్య, బీసీసెల్ అధ్యక్షుడు రత్నాల రంగనాథం, సోషల్ మీడియా కోఆర్డినేటర్ భరత్‌రాజు, యూనిట్ ఇన్‌చార్జి సోను, కాంతారావు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలి

వీరఘట్టం: రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని పార్టీ మండలాధ్యక్షుడు ఉదయాన ఉదయ్‌భాస్కర్ కోరారు. గురువారం వీరఘట్టం గౌడవీధిలో పార్టీ పట్టణాధ్యక్షుడు జామి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శంఖారావం క్యాలెండర్‌ను ఇంటింటికి పంపిణీ చేశారు. కార్య క్రమంలో బూత్ ఇన్‌చార్జి పాలకొండ చిన్న, టిడిపి నాయకులు దేవి, జలుమూరు ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలపై అవగాహన

కురుపాం: మండలంలోని గిరిజన గ్రామాల్లో టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి తోయక జగదీశ్వరి పర్యటించి, సూపర్ సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. మండలంలోని జి.శివడ పంచాయతీ అంటిజోల, దిగువఅంటిజోల, కించయ్యగూడ, డెప్పిగూడ, తాటా పాటుగూడ గ్రామాల్లో టీడీపీ అమలు చేయనున్న ఆరు గ్యారెంటీలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్, అరకు ఎస్టీ సెల్ కార్యదర్శి నందివాడ కృష్ణబాబు, మండల కన్వీనర్ కేవీ కొండయ్య, యూనిట్ ఇన్‌చార్జి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ సుబ్బలక్ష్మి, మల్లేష్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రశ్నించే గొంతు వింటే జగన్‌కు వణుకు

సాలూరు: మహాత్మా.. రాష్ట్రాన్ని పాలించే నాయకులకు బుద్ధిని ప్రసాదించాలని టీడీపీ సాలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. గురువారం టీడీపీ, జనసేన నాయకులతో కలిసి స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. అనంతరం వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రశ్నించే గొంతు వింటే జగన్ రెడ్డికి ఒణుకు వస్తుందని అన్నారు. ఆయనకు ప్రజలు, ప్రతిపక్షాలు, మీడియా అంటే భయమన్నారు. ఆయన భయన్ని కప్పిపుచ్చుకునేందుకు మీడియా పై దాడులు చేస్తున్నారని ఆమె ఆరోపించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భంజ్‌దేవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో రాజారెడ్డి పాలన సాగుతుందన్నారు. ఇంత అరాచకపాలన గతంలో ఎన్నడూచూడలేదని విమర్శించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ నాయకులు నిమ్మాది తిరుపతిరావు, పిన్నింటి ప్రసాద్‌బాబు, పరమేష్, కునిశెట్టి భీమారావు, జనసేన నాయకులు జగదీష్, శివ పాల్గొన్నారు.



సాలూరు: మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

గిరిజనులకు పట్టాలు అందించాలి

ఏళ్ల తరబడి గిరిజనులు సాగు చేస్తున్న భూములకు తక్షణం భూ పట్టాలు ఇవ్వాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుమ్మిడి సంధ్యారాణి కోరారు. పట్టణంలో తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో రెండో రోజు నిరసన దీక్షలుచేస్తున్న గిరిజనుల వద్దకు వెళ్లి ఆమె సంఘీభావం తెలిపారు. గిరిజనులు సాగు చేస్తున్న భూములకు తక్షణం పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే భంజ్‌దేవ్, మర్రి శ్రీను పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలుపై దృష్టి సారించండి

- జిల్లా పంచాయతీ అధికారి సత్యనారాయణ



మాట్లాడుతున్న డీపీవో సత్యనారాయణ

కొమరాడ: ఇంటి పన్నుల వసూళ్లపై పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెలాఖరులోగా 80 శాతం ఇంటిపన్నులు వసూళ్లు కావాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. అలాగే 2024-25 సంవత్సరానికి సంబంధించి పంచాయతీ అభివృద్ధి ప్రణాళికల ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. రానున్న వేసవిలో గ్రామాల్లో నీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రభాకర్‌రావు, ఎంపీడీవో మల్లికార్జునరావు, ఈవోపీఆర్డీ రాధాకృష్ణ పాల్గొన్నారు.

కొండచీపుర్ల తయారీపై శిక్షణ

కొమరాడ: మండలంలోని పెదశేఖలో వీడీవీకే ద్వారా కొండచీపుర్లు తయారీపై గురువారం శిక్షణకార్యక్రమాన్ని నిర్వహించారు. నాలుగు రోజులపాటు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు వెలుగు ఏపీఎం వెంకటరమణ తెలిపారు. పార్వతీపురం ఐటీడీఏ ఆదేశాల మేరకు 50 మందికి శిక్షణ ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. శిక్షణ ద్వారా నాణ్యమైన కొండచీపుర్లు మార్కెట్లోకి రావడంతో మంచి లాభా లు పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రాణి రత్నకుమారి, ఎఫ్‌పీవో సీసీ ఈశ్వరమ్మ, జనరల్ సీసీ గణేష్‌కుమార్, బి.వెంకటరమణ పాల్గొన్నారు.

గోతిలో దిగబడిన లారీ

- అంతర్రాష్ట్ర రహదారిలో గుమడ సమీపంలో నిలిచిన వాహనాలు

కొమరాడ: పార్వతీపురం నుంచి రాయగడ వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిలో మండలంలోని గుమడ గ్రామ సమీపంలో ఏర్పడిన గోతిలో కర్రల లారీ దిగబడటంతో గంటల కొద్దీ ట్రాఫిక్ నిలిచిపోయింది. గురువారం ఉదయం పార్వతీపురం నుంచి జేకే పేపర్ మిల్లుకు వెళ్తున్న లారీ గోతిలో దిగబడింది. దీంతో సుమారు నాలుగు కిలో మీటర్ల మేర వాహనాలు ఇరువైపులా నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న కొమరాడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దిగబడిన లారీని బయటకు తీసి, వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు

గరుగుబిల్లి: గ్రామాల్లో అసాంఘిక చర్యలకు పాల్పడితే చర్యలు తప్పవని పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో పలు ఘటనల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా, మద్యం సీసాలను అక్రమంగా తరలిస్తున్న సమయంలో గరుగుబిల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐదు వాహనాలు, చినమేరంగి పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు వాహనాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.పాలకొండ సబ్ డివిజన్ పరిధిలో సారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు.కార్యక్రమంలో ఎస్ఐ వై.అమ్మన్నరావు పాల్గొన్నారు.

ఎన్‌కే రాజపురంలో శిఖర ప్రతిష్ఠ

పాలకొండ: మండలంలోని ఎన్‌కేరాజపురంలో కోదండరామస్వామి సమేత శ్రీసీతారామలక్ష్మణ, హనుమ, గణనాథ షిర్డీసాయి ఆలయంలో విగ్రహ యంత్రమూర్తి శిఖర ప్రతిష్ఠా మహోత్సవం గురువారం ముగిసింది. ఉదయం మండపారాధనలు, శేషహోమాలు, పూర్ణాహుతి అర్చకులు దార్లపూడి సత్యకూర్మనాథశర్మ, వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదానం కార్యక్రమంలో ఆరువేల మంది పాల్గొన్నారు. కాగా ఎమ్మెల్యే కళావతి స్వామివారిని దర్శించుకున్నారు.

కొఠియాలో విద్యుత్ నిలుపుదల

- నేతల ఆదేశాల మేరకు ఏపీఈపీడీసీఎల్ అధికారుల పునరుద్ధరణ

సాలూరు రూరల్: కొఠియా గ్రూపు గ్రామాలైన ధూళిభద్ర, ఎగువశెంబి తదితర గ్రామాలకు రెండు రోజుల కిందట ఏపీఈపీడీసీఎల్ అధికారులు వెళ్లారు. విద్యుత్ మీటర్లు తీసుకుంటేనే విద్యుత్ సరఫరా కొనసాగిస్తామని, లేకుంటే నిలిపివేస్తామని చెప్పారు. వెంటనే ధూళిభద్ర, ఎగువశెంబి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా గ్రామస్థులు ఆ రెండు రోజులు అంధకారంలో మగ్గారు. ఇదేవిషయమై తమ నేతలకు చెప్పడంతో వారి ఆదేశాల మేరకు గురువారం ఉదయం విద్యుత్తును పునరుద్ధరించారు. కాగాఈవిషయమై సాలూరు ఏపీఈపీడీసీఎల్ ఏఈ సింహాచలం, డీఈరంగారావు దృష్టికి తీసుకెళ్లగా ప్రధాని జన్‌మన్ కార్యక్రమంలో వారికి ఉచితంగా మీటర్లు పెట్టి ఉచిత విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈమేరకు ఆధార్‌కార్డులు, తదితరవాటిని అడిగామని చెప్పారు. కొఠియా గ్రామాలకు విద్యుత్ పునరుద్ధరించామని ఏపీఈపీడీసీఎల్ ఈఈ కిశోర్ చెప్పారు. ప్రధాని జన్‌మన్ పథకంలో రెండు వందల యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ ఇవ్వడానికి అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించామని తెలిపారు. వారంరోజుల్లో కుల ధ్రువీకరణ, ఆధార్ తదితర వాటిని సమర్పించేలా అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. విద్యుత్ సరఫరా నిలుపుదల వంటి చర్యలకు పాల్పడొద్దని చెప్పామన్నారు.ఇదిలా ఉండగా, పగులుచెన్నారు, పట్టుచెన్నారు గ్రామాల్లో గురువారం సాయంత్రం నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

కొఠియాలో ఒడిశా ఆర్డీసీ పర్యటన

సాలూరు రూరల్: కొఠియాలో గురువారం ఒడిశా ఆర్డీసీ (సదరన్ రీజియన్ డివిజన్ కమిషనర్) రంజన్ కుమార్‌దాస్ పర్యటించారు. కొఠియాలో విద్యాసంస్థలను పరిశీలించి విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రి తదితర వాటిని పరిశీలించారు. కొఠియా గ్రూపు గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరగాలన్నారు. వివిధ పథకాలు గిరిజనులకు సత్వరం చేరువయ్యేలా అధికారులు చొరవ చూపాలని ఆదేశించారు. వివిధ అంశాలపై సమీక్షించారు. ఆయనతో కొరాపుట్ జిల్లా కలెక్టర్ వాసన్‌పొట్టంగి ఏఈఈ, ఏపీవో, జేఈ, రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.

దేవ్‌మాలిపై ప్రత్యక్ష పెయింటింగ్ పోటీలు

సాలూరు రూరల్: కొఠియా కొండల్లో భాగమైన ఒడిశాకు చెందిన దేవ్‌మాలి కొండపై ఒడిశా లలిత కళా అకాడమీ గురువారం ప్రత్యక్ష చిత్రలేఖన పోటీలను నిర్వహించింది. ఒడిశా రాష్ట్రంలో వివిధ జిల్లాలకు చెందిన 15 మంది ప్రసిద్ధ కళాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. కళాకారులు గీసిన చిత్రాలను కొరాపుట్ జిల్లా కేంద్రంలోని ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శించారు.

బోర్లకు పగటి పూట త్రీఫేజ్ సరఫరా నిలుపుదల

సాలూరు రూరల్: మండలంలో వ్యవసాయ బోర్లకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా మూడు రోజుల వరకు ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఏఈ దాసరి సింహాచలం గురువారం తెలిపారు. దేవ్‌బుచ్చంపేట గ్రామంలో ఉన్న 33 కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరా కేపాసిటీ నిర్వహణ పనులు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో సరఫరా ఉండదన్నారు. వ్యవసాయ బోర్లకు రాత్రి రెండు నుంచి ఉదయం ఎనిమిది గంటల వరకు సరఫరా ఉంటుందని చెప్పారు.

కేజీబీవీని సందర్శించిన ప్రత్యేక బృందం

సీతానగరం: జోగింపేట కేజీబీవీ పాఠశాలలో లిప్ అమలు తీరు పరిశీలనకు గురువారం ప్రత్యేకబృందం సందర్శించింది. నల్లా తిరుపతినాయుడు, నరేష్, ప్రవీణ్‌ల బృందం తరగతి గదిలో టీచింగ్ పీరియడ్, ప్రాక్టీస్ పీరియడ్‌లను సమీక్షించారు. బోధనా పద్ధతులను పరిశీలించారు. వెనుకబడిన విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని చదవడం, రాయడం మీద శ్రద్ధ చూపాలని, లెర్నింగ్ స్కిల్స్ మెరుగు పరచాలని ఆదేశించారు. వాటికి ప్రత్యేక రికార్డులు నిర్వహించాలని సూచించారు. పదో తరగతి పరీక్షల దృష్ట్యా సలహాలు, సూచనలుఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ సూరిదేముడు, ప్రిన్స్‌పాల్ జొన్నాడ సంధ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మంతిని వీధిలో అగ్ని ప్రమాదం

కురుపాం: స్థానిక మంతిని వీధిలో మంతిన సంతోష్‌కుమార్ ఇంట్లో గురువారం ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ కావడంతో అగ్నిప్రమాదం సంభవించింది. దీంతో అతని పెంకుటింటిలో ఉన్న సామగ్రి అగ్నికి ఆహుతయ్యింది. అలాగే ఇంటిపై కప్పుపై ఉన్న పెంకుల మధ్య ఉన్న కర్రలు కాలిపోయాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపులోకి తీసుకువచ్చారు.

నేడు ఆశ్రమ పాఠశాలల పరిశీలన

సాలూరు రూరల్: జిల్లాలో ఆశ్రమ పాఠశాలల్లో గిరిజన విద్యార్థులు మరణించడంపై పరిశీలన చేపడతామని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావు తెలిపారు. ఆంధ్రజ్యోతిలో గురువారం ప్రచురితమైన మరణ మృందగం కథనంపై ఆయన స్పందించారు. పాచిపెంట మండలం సరాయివలస, మక్కువ మండలం ఎర్రసామంతవలస గిరిజనఆశ్రమ పాఠశాలలను శుక్రవారం పరిశీలిస్తామని చెప్పారు.

రేపు కుశిమిలో వైద్యశిబిరం

సీతంపేట: కుశిమి వారపుసంతలో సీతంపేట పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలోశనివారం వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ జగదీష్‌నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు నిర్వహించనున్న శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు చక్రతీర్థ స్నానం

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవెంకటేశ్వర, కోదండరామస్వామి ఆలయాల్లో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా నిత్యారాధన, విశేష హోమాలు, మంగళా శాసనాలు, మృత యవినోదంతో పాటు స్వామివారిని ప్రత్యేక పల్లకిపై తిరు వీధి నిర్వహించారు.ఈసందర్భంగా ఈవో వీవీ సూర్యనారాయణ, ప్రధాన అర్చకుడు వీవీ అప్పలాచార్యులు మాట్లాడుతూ శనివారం వరకు ఆలయంలో ప్రత్యేక అర్చనలు, పూజలు నిర్వహిస్తారని చెప్పారు. ముగింపును పురస్కరించుకుని నాగావళి నదీ తీరంలో స్వామివారికి శ్రీచూర్ణోత్సవం, శ్రీచక్రతీర్థస్నానం భక్తుల నడుమ అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధికంగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలన్నారు.

26న రౌండ్‌టేబుల్ సమావేశం

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యంలో జరుగుతున్న గిరిజన విద్యార్థుల మరణాలపై ఈనెల 26వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు విద్యార్థి, యువజన సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు గిరిజన సంక్షేమ సంఘం, గిరిజన నిరుద్యోగ సంఘాల నాయకులు రంజిత్‌కుమార్, సాయి బాబు, ఆరిక ప్రభాకర్,నాగార్జున, చందు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో అందరూ పాల్గొనాలని కోరారు.

పోటీ పరీక్షలకు సిద్ధం కావాలి

గుమ్మలక్ష్మీపురం: నిరుద్యోగ గిరిజన యువత పోటీ పరీక్షలకు సిద్ధంకావాలని జడ్పీటీసీ మాజీ సభ్యురాలు కె.లక్ష్మి కోరారు. గుమ్మలక్ష్మీపురంలోని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో యువతకు గ్రూప్-2 మెటీరియల్‌ను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో చెముడుగూడ ఎంపీటీసీ మండంగి రమణ, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు, వి.మోహన్ రావు, పాండురంగ పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థుల మరణాలు దారుణం

సాలూరు రూరల్: పార్వతీపురం మన్యం జిల్లా గిరిజన విద్యార్థుల మరణాల్లో ముందున్నదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు వ్యాఖ్యానించారు. ఆయన మామిడిపల్లిలో గురువారం విలేకర్లతో మాట్లాడారు. గత జూన్ నుంచి ఇప్పటి వరకు గిరిజన ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలకు చెందిన 16మంది గిరిజన విద్యార్థులు ప్రాణాలు కోల్పోయినట్టు చెప్పారు.ఈ మరణాలకు ఐటీడీఏ, ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. ఆశ్రమపాఠశాలల్లో ఏఎన్‌ఎం పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్‌చేశారు. రక్తహీనత నివారణకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కుక్, కమాటీ పోస్టులను భర్తీ చేసి నాణ్యమైన పౌష్టికాహారం అందే విధంగా పర్యవేక్షణ పెరగాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి చొరవ తీసుకొని పాలక మండలి సమావేశం జరిగేలా చూడాలన్నారు. ఆయనతో సీఐటీయూ నేతలు జ్యోతీశ్వరరావు, భాస్కరరావు ఉన్నారు.

సీది వాసికి యూఎన్‌వో సదస్సుకు ఆహ్వానం

సీతంపేట: మండలంలోని సీది గ్రామానికి చెందిన గేదెల రవికి ఐక్యరాజ్యసమితి పర్యావరణ సదస్సుకు ఆహ్వానం అందింది. ఈమేరకు రవి గురువారం ఒకప్రకటన విడుదలచేశారు. కొద్దేళ్లుగా శ్రీకాకుళంలోని రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్‌నాలెడ్జ్ టెక్నాలజీలో అసిస్టెంట్‌ప్రొఫెసర్‌గా రవి విధులు నిర్వహిస్తు న్నారు.మానవజాతి కార్యకలాపాలు-పెరుగుతున్న పర్యావరణసమస్యలు పరిష్క రించడానికి ఐక్యరాజ్య సమితి పర్యావరణ కార్యక్రమంపై నైరోబిలో ఈనెల 26 మార్చి ఒకటో తేదీ వరకు జరిగే సదస్సుకు రవికి ఆహ్వానం రావడంతో సీది గ్రామానికి చెందిన ఆదివాసీలు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.